క్లుప్తంగా

అప్పన్నకు వెండి పాత్రలు బహూకరణ



ఈవోకు వెండి పాత్రలు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నగరంలోని సీతమ్మధారకు చెందిన ఆచంట నాగభూషణరావు కిలో బరువుగల నాలుగు వెండి పాత్రలను కానుకగా సమర్పించారు. సింహగిరికి కుటుంబ సమేతంగా వచ్చిన దాత వాటిని దేవస్థానం ఈవో కె.సుబ్బారావుకు అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్, దేవస్థానం పంచాంగకర్త తెన్నేటి శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా చివరిరోజు ఆదివారం సాయంత్రం జరిగిన నృత్యప్రదర్శన స్వామివారి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. విజయవాడకు చెందిన నటరాజ నృత్యాలయం కళాకారులు చేసిన ఆంధ్ర నాట్యం, నగరానికి చెందిన మామిళ్లపల్లి శ్రీశుభ బృందంచే జరిగిన గాత్రకచేరి విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ రాజగోపురం పక్కన ఉన్న కళావేదికపై ఈకార్యక్రమాలు నిర్వహించారు.

సందడిగా తీరప్రాంతాలు



తీరంలో జలకాలాడుతున్న సందర్శకులు

పరవాడ: ఆదివారం వచ్చిందంటే చాలు తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాలు సందర్శకులతో సందడిగా మారిపోతాయి. అనకాపల్లి, సబ్బవరం, స్టీల్‌ప్లాంటు, లంకెలపాలెం, తోటాడ, పరవాడ, దీపాంజలినగర్ తదితర ప్రాంతాల నుంచి సందర్శకులు ఆదివారం ఉదయం 10 గంటలకు చేరుకొని తీరంలో ఎన్టీపీసీ పంప్‌హౌస్ కింద సేద దీరారు.

కంబాలకొండలో పర్ణశాల



కంబాకొండ పార్కులో ఆధునికీకరించిన క్యాంటీన్

ఆరిలోవ: కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో ఆధునికీకరించిన క్యాంటీన్ పర్ణశాలను తలపిస్తోంది. ఇక్కడ కొద్ది రోజులుగా పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇటీవల శిథిలావస్థలో ఉన్న క్యాంటీన్‌ను తొలగించి ఆధునీకరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పచ్చని చెట్లను నాశనం చేయకుండా వాటి మధ్యలోనే తాటి కలప, గడ్డి ఉపయోగించి పైకప్పు నిర్మించారు. క్యాంటీన్ గోడలపై అటవీ శాఖకు చెందిన ఎర్రని రంగులు, గిరిజనుల ఆచార వ్యవహారాలతో బొమ్మలు వేశారు. దాని చుట్టూ అందం కోసం పచ్చని లేన్లు, దాని ముందు చిన్న నీటి కొలను ఏర్పాటు చేశారు. దీంతో ఈ క్యాంటీన్ సందర్శకులను కనువిందు చేస్తోంది. ఇది చూడడానికి పర్ణశాలలా ఉందంటూ సందర్శకులు అభివర్ణిస్తున్నారు. ఇక్కడ కొలను చుట్టూ సందర్శకులు సేదదీరడానికి క్రర బెంచీలు ఏర్పాటు చేయనున్నారు.

వికసించిన బారెల్ కాక్టస్ పుష్పాలు



ప్రయాణికుల స్నేహితుడిగా పిలవబడే ఎమోరీ బారెల్ కాక్టస్(ఫెరోకాక్టస్ ఎమోరీ) మొక్క పుష్పాలు పెదవాల్తేరు బయోడైవర్సిటీ పార్క్‌లో పూర్తిగా వికసించి సందర్శకులను కనువిందు చేస్తున్నాయి. బారెల్ కాక్టస్ మొగ్గలు సాధారణంగా ఏప్రిల్‌లో ప్రకాశవంతమైన పసుపు, నారింజ రంగు పువ్వులతో వికసిస్తాయి. ఈ జాతి మొక్కలకు ముళ్లు ఉంటాయి. ఇవి ఎడారుల్లో ఎక్కువగా కనిపిస్తాయి. - బీచ్‌రోడ్డు

సుజల ధార బంద్

బయోటాయిలెట్లు క్లోజ్



నిరుపయోగంగా మారిన టాయిలెట్



సబ్బవరంలో నిరుపయోగంగా హరిత బయో టాయిలెట్స్



గుల్లేపల్లిలో మూలకు చేరిన సూర్య సుజల ధార శుద్ధి చేసే యూనిట్

- రూ.20 లక్షలతో గుల్లేపల్లి, సబ్బవరంలో ఏర్పాటు
- నిర్వహణ భారంతో చేతులెత్తేసిన పంచాయతీలు
- నిరుపయోగంగా సూర్య సుజల ధార, హరిత బయో టాయిలెట్స్

సబ్బవరం: గ్రామీణ ప్రాంతాలలోని చిన్నారులకు, మహిళలకు శుద్ధి చేసిన రక్షిత మంచినీటిని, వారికి అవసరమయ్యే కమ్యూనిటీ మరుగుదొడ్లను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా సనా ఫౌండేషన్ ముందుకు వచ్చింది. దీంతో సనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గూగుల్ సౌజన్యంతో సూర్య సుజల ధార, హరిత బయో టాయిలెట్లను నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చింది. స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా సనా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సంచయిత గజపతిరాజు ఆధ్వర్యంలో ఈ యూనిట్లను ఏర్పాటు చేశారు. సనా ఫౌండేషన్ ఎన్జీవో సంస్థ జిల్లా యంత్రాంగం, ఐటీడీఏతో కలిసి విశాఖ ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో ఈ యూనిట్లను ఏర్పాటు చేసింది. ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఈ యూనిట్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మూలకు చేరాయి.

ఈ యూనిట్ల ద్వారా ఆయా గ్రామీణ ప్రాంతాలలో సనా సూర్య సుజల ధార యూనిట్ ద్వారా శుద్ధిచేసిన రక్షిత మంచినీటిని నామినల్ ధరకు విక్రయించి వినియోగదారులకు అందించేవారు. శుద్ధి చేయగా వచ్చిన వ్యర్థ జలాలను అక్కడ నిర్మించిన కమ్యూనిటీ హరిత బయో టాయిలెట్లలో వినియోగించుకునే విధంగా రూపకల్పన చేశారు. నామినల్ ధరకు రక్షిత మంచి నీటిని విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయాన్ని యూనిట్ల నిర్వహణకు వినియోగించుకునే విధంగా కార్యాచరణ సిద్ధం చేశారు. వచ్చిన ఆదాయంతో యూనిట్లు నిర్వహించే సిబ్బందికి జీతాలు చెల్లించి నిర్వహణకు ఆర్థికపరమైన ఇబ్బందులు లేకుండా కొనసాగించే విధంగా విధివిధానాలు సిద్ధం చేశారు.

రూ.20 లక్షలతో..

మండలంలోని గుల్లేపల్లి, సబ్బవరం మేజర్ పంచాయతీలలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఆధ్వర్యంలో అట్టహాసంగా ఈ యూనిట్లను ప్రారంభించారు. ఒక్కొక్క యూనిట్ సుమారు రూ.20 లక్షల వ్యయంతో సనా సూర్య సుజల ధార, హరిత బయో టాయిలెట్లను నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చారు. వాటి నిర్వహణకు అవసరమయ్యే సిబ్బందిని ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ బాధ్యతలు ఆయా పంచాయతీలు తీసుకోనే విధంగా చర్యలు చేపట్టారు. అయితే ఆయా పంచాయతీలలో ఈ యూనిట్లను సక్రమంగా నిర్వహించకపోవడంతో కొన్నాళ్లకే నిరుపయోగంగా మారాయి.

అలంకారప్రాయంగా..

మండల కేంద్రం సబ్బవరం మేజర్ పంచాయతీలో ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న సీతారామ కల్యాణ మండపం ఆవరణలో ఈ సనా సూర్య సుజల ధార, హరిత బయో టాయిలెట్లను నిర్మించారు. సుమారు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ యూనిట్‌ను 2017లో అప్పటి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉన్న ఈ యూనిట్ పంచాయతీ నిర్వహించకపోవడంతో అలంకారప్రాయంగా మారింది.

నిర్వహణ భారం



సుజల ధార, హరిత బయో టాయిలెట్ల యూనిట్లను గుల్లేపల్లి గ్రామంలోని గ్రామ సచివాలయం ఆవరణలో ఏర్పాటు చేశారు. గుల్లేపల్లి గ్రామం మేజర్ పంచాయతీ కావడంతో ప్రజలకు ఇవి ఎంతో ఉపయోగంగా ఉండేవి. అయితే నిర్వహణ భారం కారణంగా పంచాయతీ చేతులెత్తేసింది. దీంతో అప్పటి నుంచి యూనిట్ నిరుపయోగంగా మారాయి.

– బందారు శ్రీను, గుల్లేపల్లి గ్రామం, సబ్బవరం మండలం

ఎంతో ఉపయోగంగా ఉండేవి



గ్రామీణ ప్రాంతం నుంచి అనేక మంది తమ కార్యకలాపాలతో పాటు పలు అవసరాలపై ప్రభుత్వ కార్యాలయాలకు తరలివస్తారు. సబ్బవరం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలలో గానీ, మిగిలిన బహిరంగ ప్రదేశాలలో గానీ కమ్యూనిటీ మరుగుదొడ్లు లేవు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న సీతారామ కల్యాణ మండపం ఆవరణలో ఏర్పాటు చేయడంతో ఎంతో ఉపయోగంగా ఉండేవి. ప్రస్తుతం వాటి నిర్వహణ పూర్తిగా వదిలేశారు.

– సింగంపల్లి వెంకటరావు, సబ్బవరం

వినియోగంలోకి తెస్తాం



సనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సూర్య సుజల ధార, కమ్యూనిటీ బయో టాయిలెట్లను నిర్వహించాల్సిన బాధ్యత ఆయా గ్రామ పంచాయతీలదే. యూనిట్ నిర్వహణ వలన వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో పంచాయతీ నిధులు వెచ్చించాల్సి వచ్చేది. గుల్లేపల్లి, సబ్బవరంలో ఏర్పాటు చేసిన యూనిట్లను నిర్వహించే విధంగా ఆయా పంచాయతీ సర్పంచ్‌లతో మాట్లాడి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తాం.

– పద్మజ, సబ్బవరం ఎంపీడీవో

నేడు అయ్యప్ప సన్నిధిలో విషుపూజ

పెందుర్తి: సుజాతనగర్‌లోని పూర్ణ పుష్కళ సమేత శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం విషు పూజ నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులంతా తరలివచ్చి పూజల్లో పాల్గొనాలని కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే జైలే



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ దేముడునాయుడు

పెందుర్తి: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే జైలు పాలు కావాల్సి వస్తుందని సబ్ ఇన్‌స్పెక్టర్ దేముడు నాయుడు రౌడీ షీటర్లను హెచ్చరించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సీఐ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చెడు ప్రవర్తన వలన తమ తమ కుటుంబాలను సమాజంలో చిన్న చూపు చూస్తారన్నారు. మంచి నడవడికతో ఉంటే రౌడీషీట్‌లు ఎత్తివేయడానికి ఉన్నతాధికారులు ఆలోచన చేస్తారని వివరించారు.

సంద్రంలో చిక్కుకున్న పర్యాటకులు



పర్యాటకులను కాపాడుతున్న లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో ఇద్దరు యువకులు చిక్కుకున్నారు. పెందుర్తికి చెందిన జి. భాస్కర్, ఎంవీ ఆదిత్య ఆదివారం మధ్యాహ్నం బీచ్‌కు చేరుకున్నారు. కాసేపు వీరు సరదాగా గడిపి స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. వీరిద్దరు స్నానాలు చేస్తూ సముద్రంలోపల చిక్కుకున్నారు. ఈత రాని వీరు పరిస్థితిని గమనించి పెద్దగా కేకలు వేశారు. ఇది గమనించిన లైఫ్‌గార్డ్ చందు అప్రమత్తమై మిగిలిన లైఫ్‌గార్డ్స్‌తో కలిసి పడవపై వెళ్లి సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు.

మహోన్నత వ్యక్తి అంబేడ్కర్

- రాజ్యాంగంతో దేశానికి దిశానిర్దేశం చేశారు
- కూటమి పాలన చాలా దారుణంగా ఉంది
- సంక్షేమ పథకాలు అమలు చేయడంలో విఫలం
- మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నేత జూపూడి ప్రభాకర్‌రావు



జుత్తాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జూపూడి ప్రభాకర్, ఎంపీ గొల్ల బాబారావు

పెందుర్తి: భారతదేశానికి రాజ్యాంగాన్ని రూపొందించిన బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ మహోన్నత వ్యక్తి అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ క్యాస్ట్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్ రావు అన్నారు. రాజ్యాంగంతో దేశానికి దిశా నిర్దేశం చేశారని కొనియాడారు. పెందుర్తి మండలం వాలిమెరక జుత్తాడలో భీమ్‌రావ్ రాంజీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు గొల్ల బాబూరావుతో కలిసి ఆదివారం జూపూడి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ అంబేడ్కర్ ఒక కులానికో..మతానికో ప్రతినిధి కాదని..దేశంలోని ప్రతీ వ్యక్తికి మార్గనిర్దేశకుడని అన్నారు. రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తప్పుడు హామీలతో ప్రజలను దారుణంగా వంచించిందన్నారు. సూపర్ సిక్స్ పేరుతో ఎన్నికల్లో తప్పుడు హామీలిచ్చిన నాయకులు ఇప్పుడు నిధులు లేవూ..సంపద సృష్టించి ఇస్తామని మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రిగా ఐదేళ్లు పాలించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదలకు అన్నం పెట్టారన్నారు. బడుగు బలహీన వర్గాలతో పాటు ప్రజల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని సంక్షేమ పథకాలు అమలు చేశారని కొనియాడారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ భారతదేశాన్ని ప్రపంచ పటంలో నిలిపేందుకు రాజ్యాంగం పేరుతో బీజాలు వేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే, పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్, జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, ఎంపీపీ మధుపాడ నాగమణి, సర్పంచ్ బొడ్డు చంద్రవాణి ప్రకాష్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మనాలత జోబ్‌దాస్, భీమ్‌రావ్ రాంజీ సేవా సంఘం ప్రతినిధులు మువ్వల వెంకటరమణ (శ్రీను), మువ్వల రమణ, కాటపల్లి అప్పారావు, మువ్వల చిన్నఅప్పారావు, మువ్వల రాంబాబు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

బూడి ముత్యాలనాయుడుకు అభినందనలు



బూడి ముత్యాలనాయుడుకు సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పరవాడ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యునిగా నియమితులైన మాజీ ఉప ముఖ్యమంత్రి, అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడును ఆయన స్వగ్రామం తారువాలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశామని రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు చెప్పారు. పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యుడిగా నియమితులైన బూడి ముత్యాలనాయుడును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు అందజేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు, అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీ, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి బందం నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, గెంజి సురేష్ ఉన్నారు.

ఆటిజంపై అవగాహన అవసరం



అవగాహన ర్యాలీలో పాల్గొన్న నగరవాసులు, దివీస్ ఉద్యోగులు

ఏయూక్యాంపస్: నగరవాసుల్లో ఆటిజంపై అవగాహన పెంచాల్సిన అవసరముందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. దివీస్ లేబరేటరీ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్కే బీచ్ రోడ్డులో నిర్వహించిన ఆటిజం అవగాహన నడక కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో ఆటిజంపై అవగాహన కల్పించడం, ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్న వారిని సమాజంలో భాగం చేయడం, సానుకూల ఆలోచనతో వారిని స్వీకరించడం ఎంతో అవసరమన్నారు. శ్రేయ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.ఉషాదేవి మాట్లాడుతూ ప్రతి ఏలా ఏప్రిల్‌లో ఆటిజం అవగాహన మాసంగా నిర్వహిస్తామన్నారు. ప్రతీ 100 మంది పిల్లల్లో ఒకరికి ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. దీనిపై అవగాహన కలిగి ఉండటం, సరైన సమయంలో స్పందించడం ఎంతో అవసరమన్నారు. పిల్లల్లో ఆటిజం గుర్తించడం, రోజువారి జీవితంలో వారు ఎదుర్కొనే సవాళ్లను వివరించారు. కార్యక్రమంలో దివీస్ లేబరేటరీ డైరెక్టర్ డాక్టర్ దేవేంద్రరావు, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎల్.వి.రమణ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.మాధవి, అధిక సంఖ్యలో దివీస్ లేబరేటరీ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నావెల్ డాక్‌యార్డ్ సంక్షేమ సంఘం సమావేశం



మాట్లాడుతున్న పీఏ నాయుడు తదితరులు

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడు పాలెం గ్రామంలో నేవల్ డాక్‌యార్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘ కార్యాలయంలో సంఘ సర్వ సభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు ఎస్. దాసుబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆదిలక్ష్మి జ్యూవెలర్స్ అధినేత పి.ఎ. నాయుడు, పి. అనిల్ కుమార్ పాల్గొన్నారు. సంఘ అభివృద్ధి గురించి ముఖ్య అతిథులు మాట్లాడారు. అనంతరం సంఘ సభ్యులకు వారి చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు రోంగలి కృష్ణారావు, సలహాదారులు సోర్ణపూడి సత్యం, అధ్యక్షుడు మేడపాటి దాసుబాబు, ఉపాధ్యక్షుడు జి. అచ్యుతరావు, ప్రధాన కార్యదర్శి రావిపల్లి రవి, సలహా కార్యదర్శి కోల్లి ప్రసాద్, ఆర్. రమణ, కోశాధికారి గోర్లి దేముడు, సిరపరపు హరీష్‌తో పాటు, పాలకవర్గ సభ్యులు పైల శ్రీరాములు, ఎస్. ఎర్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం కేథలిక్ చర్చిలో మట్టల ఆదివారం ప్రార్థనలు



మట్టల ఆదివారం ఊరేగింపులో పాల్గొన్న క్రైస్తవులు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరం కేథలిక్ చర్చిలో మట్టల ఆదివారం ప్రార్థనలు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఇక్కడ ఫాతిమా మాత చర్చి విచారణ గురువు ఫాదర్ థామస్ పులికల్ క్రీస్తు ప్రభువును అప్పటి జెరూసలేంలో ప్రజలు స్వాగతం పలికిన తీరును పవిత్ర గ్రంథం బైబిల్ వేద పఠనంను అనుసరించి చదివి వినిపించారు. క్రీస్తు రాజును జెరూసలేం ప్రజలు ఊరేగింపు కోసం చేస్తున్న ప్రయత్నం గుర్తించిన ప్రభువు ఒక చోట ఇంతవరకూ ఎవరూ పయనించని గాడిదను తన కోసం తండ్రి దేవుడు ఏర్పాటు చేసినందున దాన్ని తీసుకురావాలని ఆదేశించారని పేర్కొన్నారు. ఆనాటి జెరూసలేం ప్రజలు క్రీస్తు ప్రభువును ఊరేగించిన దినాన్ని నేడు ప్రూను కొమ్మల (మట్టల) ఆదివారం అని పిలుస్తూ క్రైస్తవ భక్తి గీతాలతో ఊరేగిస్తారని చెప్పారు. అనంతరం భక్తులకు ఫాదర్ థామస్ దివ్య సత్ప్రసాదం పంపిణీ చేశారు. ఈ ప్రత్యేక దివ్య బలిపూజలో కేథలిక్ పారిష్ పాలకవర్గం అధ్యక్షుడు పి. మాణిక్యాలరావు, ఆడారి నాగరాజు, శరగడం గణేష్, పాలవెల్లి సుఖరాజు, ఎ. మహాలక్ష్మీనాయుడు, దనుంజయ, సిస్టర్స్ పునీత, అలీస, సోనా, ఫ్లోరా, విజయప్రభ, పుష్పలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి నిర్వహించనున్న సమ్మెకు సంబంధించిన గోడపత్రికను ఆదివారం ఆవిష్కరించారు. ఉక్కు కార్మిక సంఘం కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యాజమాన్యం వేలాది మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తుందన్నారు. తమకు గత్యంతరం లేక సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో నమ్మి రమణ, జి. శ్రీనివాసరావు, మంత్రి రవి, కె. వంశీకృష్ణ, ఆనంద్, కోన రమణ పాల్గొన్నారు.

దుర్గమాంబ ఆలయానికి బెంచీల వితరణ

పెదగంట్యాడ: కొత్త కర్ణవానిపాలెంలోని పైడిమాంబ, దుర్గమాంబ ఆలయానికి ఆదివారం సిమెంట్ బెంచీలు బహూకరించారు. కలుకూరి సుబ్బారావు (తాతాలు) జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కులుకూరి మంగరాజు వీటిని అందజేసి ప్రారంభించారు. కార్యక్రమంలో చవాకుల అప్పలరాజు, వజ్రాన త్రినాథ్ యాదవ్, విరోతి భాస్కర్, విరోతి గోవింద్, విరోధి వరహాలరావు, కర్ణం రాజు తదితరులు పాల్గొన్నారు.